బాణసంచా విక్రేతలపై కేసుల నమోదు

సబ్బవరం: మండల కేంద్రంలో ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ రంగనాథం తెలిపారు. మండలంలో దీపావళికి మాత్రమే కొంత మందికి బాణసంచా విక్రయించేందుకు అనుమతులు ఇచ్చామన్నారు. నాగుల చవితికి బాణసంచా విక్రయించేందుకు ఎవరికీ ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. అయినా నాగుల చవితిని పురస్కరించుకుని బాణసంచా షాపులు నిర్వహిస్తున్న మండలంలోని తవ్వవానిపాలేనికి చెందిన దంగేటి సంతోష్ గుప్తా, రెడ్డి వెంకటరాజు, సబ్బవరానికి చెందిన పెన్నం శ్రీను, గాలిభీమవరానికి చెందిన వాకాడ రవితేజపై కేసులు నమోదు చేసి వారు విక్రయిస్తున్న బాణసంచా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

కోలాటం పోటీల విజేత అంబేరుపురం

సబ్బవరం: ఆరిపాక గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయ 13వ వార్షికోత్సవంలో భాగంగా ఆలయ ధర్మకర్త మళ్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వరకూ నిర్వహించిన కోలాటం పోటీల్లో మొదటి బహుమతిని అంబేరుపురానికి చెందిన శ్రీఅంజన్న అమృత వర్షిణి కోలాటం బృందం దక్కించుకుని రూ. 10 వేల నగదు బహుమతి గెలుచుకుంది. పోటీల్లో పాల్గొన్న ప్రతి జట్టుకు ప్రోత్సాహక బహుమతిగా రూ.1,000 నగదు అందజేసినట్టు ఆలయ ధర్మకర్త మళ్ల కోటేశ్వరరావు తెలిపారు. ఈ పోటీలను ఎమ్మెల్యే అదీప్‌రాజ్ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు.

సంక్షేమానికి చిరునామా.. వైఎస్ జగన్

- ప్రజలంతా మళ్లీ సీఎంగా జగన్‌నే కోరుకుంటున్నారు
- పినగాడి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్



పినగాడిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్. చిత్రంలో జయరామ్ తదితరులు



పెదనాయుడుపాలెంలో పోస్టర్ ఆవిష్కస్తున్న ఎంపీపీ సూర్యకుమారి తదితరులు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు, నాయకులు

పెందుర్తి: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని పక్కాగా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పెందుర్తి మండలం పినగాడిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ప్రతి గడపకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని.. రానున్న ఎన్నికల్లో ప్రతి ఇంటిపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. పినగాడి పంచాయతీ అభివృద్ధికి రూ.14.5 కోట్ల నిధులను ప్రభుత్వం ఖర్చు చేసిందని ప్రజలకు వివరించారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' బుక్‌లెట్లను పంపిణీ చేశారు. గ్రామం నడిబొడ్డున వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, మండల సర్పంచ్‌ల సంఘంగా అధ్యక్షుడు గొరపల్లి శ్రీను, నాయకులు, వలంటీర్లు, గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

వెన్నెలపాలెంలో..

పరవాడ: రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మేలు చేకూర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయననే మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి ప్రజలందరు ముందుకు రావాలని పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు పిలుపునిచ్చారు. వెన్నెలపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి చేకూర్చిన లబ్ధిని వివరించారు. డిజిటల్ బోర్డును ప్రారంభించి జెండాను ఆవిష్కరించారు. నాలుగున్నరేళ్ల కాలంలో వెన్నలపాలెంలో రూ.14.84 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, వెన్నలపాలెం సర్పంచ్ వెన్నల అప్పారావు, జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామారావు, పార్టీ నాయకులు చల్లా కనకారావు, పైల అప్పలనాయుడు, పైల రేగారావు, సింహాద్రి, వర్రి హరి తదితరులు పాల్గొన్నారు.

పెదనాయుడుపాలెం సచివాలయం పరిధిలో..

సబ్బవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషితోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాదిస్తుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలిపారు. మండలంలోని పెదనాయుడుపాలెం సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే, పల్లెకు పోదాం కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రూ.19.29 కోట్లతో పలు అబివృద్ధి కార్యక్రమాలు చేపట్టగా వీటిలో రూ. 14.82 కోట్లు లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ద్వారా అందజేశారన్నారు. సచివాలయ కన్వీనర్ సబ్బవరపు నాగభూషణం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, సచివాలయ కన్వీనర్లు సబ్బవరపు నాగభూషణం, గొర్లి భవానీ, పార్టీ సీనియర్ నాయకులు సబ్బవరపు సత్యనారాయణ, బోకం రామకృష్ణ, ప్రొగ్రాం నోడల్ ఆఫీషర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



అందరికీ అనుగుణంగా షాపులు నిర్మించాలి

సింహాచలం: సింహగిరిపై ప్రసాద్ స్కీమ్‌లో భాగంగా వర్తకుల షాపింగ్ కాంప్లెక్స్‌ను అందరికీ ఆమోదయోగ్యంగా నిర్మించాలని సింహగిరి వర్తక సంఘం నాయకులు, వర్తకులు దేవస్థానం అధికారులను కోరారు. ఇంజినీరింగ్, టూరిజం ఇంజినీరింగ్ అధికారులు సింహగిరి వర్తకులతో కలిసి గురువారం షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఫీల్డ్ విజిట్ చేశారు. మెట్ల మార్గానికి సమాంతరంగా షాపులు ఉండాలని, దిగువ భాగంలో నిర్మిస్తే తామంతా నష్టపోయే పరిస్థితి ఉంటుందని వర్తకులు ఆవేదన వ్యక్తం చేశారు. దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, టూరిజం ఈఈ రమణ, సింహగిరి వర్తక సంఘం అధ్యక్షుడు మొగ్గ కిరణ్, ఉపాధ్యక్షుడు ఎస్.రాజు, వర్తకులు కస్తూరి సత్తిబాబు, బంటుబిల్లి సురేష్, మురళి, వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు బంటుబల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏయూ వీసీకి అభినందన

పెందుర్తి: ఆంధ్రా యూనివర్సిటీ నాక్ ఎ ప్లస్‌ప్లస్ గ్రేడ్ సాధించిన సందర్భంగా వీసీ ఆచార్య ప్రసాద్‌రెడ్డిని జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రత్యేకంగా అభినందించారు. ఏయూలోని వీసీ కార్యాలయంలో గురువారం కలుసుకుని పుష్ప గుచ్ఛం అందించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో వీసీ ప్రసాద్‌రెడ్డి ఏయూకి మరిన్ని ఘనతలు సాధించాలని ఆకాక్షించారు.

పంచగ్రామాల ప్రజలకు న్యాయం చేయాలి

పెందుర్తి: సింహాచలం దేవస్థానం పంచగ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన మెమో ప్రకారం త్వరగా న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దేవస్థానం ఉన్నతాధికారులకు సూచించారు. పంచగ్రామాల్లోని నివాసాలకు మరమ్మతులు చేసుకోవడానికి వీలుగా ప్రభుత్వం మెమో విడుదల చేసిన నేపథ్యంలో గురువారం దేవస్థానం అధికారులతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, సింహచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు కోరాడ చందుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

పరవాడ: స్టాఫ్‌సెలక్షన్ కమీషన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న జీడి, సీఆర్‌పీఎఫ్ విభాగాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి అవసరమైన శిక్షణను రాంకీ ఫౌండేషన్ ఉచితంగా కల్పించనుందని ఫౌండేషన్ ప్రతినిధి శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాసైన 18–23 ఏళ్ల వయస్సు కలిగిన ఓసీ అభ్యర్థులు, 26 ఏళ్లలోపు వయస్సు కలిగిన ఓబీసీ అభ్యర్థులు, 28 ఏళ్లలోపు వయస్సు కలిగిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ కల్పిస్తామని చెప్పారు. ఈ నెల 26న అర్హత పరీక్షలు నిర్వహించి 29న ఫలితాలు వెల్లడిస్తారన్నారు. డిసెంబరు 2 నుంచి శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు.

రాంపురంలో రైల్వే ఉద్యోగి అదృశ్యం

పెందుర్తి: పెందుర్తి మండలం రాంపురం గ్రామానికి చెందిన ఓ రైల్వే ఉద్యోగి అదశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన గోపిశెట్టి దుర్గ భాస్కరరావు (52) రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో క్లర్క్‌గా పని చేస్తున్నాడు. ఈ ఏడాది ఆగస్టు 27న విధులకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. దీనిపై తీవ్రంగా గాలించిన కుటుంబ సభ్యులు ఫలితం లేకపోవడంతో గురువారం పెందుర్తి పోలీసులను ఆశ్రయించారు. సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.



